www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 23 నవంబర్ 2023

5

అన్నమయ్య



మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాలోని పర్యాటక రంగంలో ఉత్తమ పర్యాటక ప్రాంతాల ఎంపికకు గాను 2024 ఏడాదికి పర్యాటక మంత్రిత్వ శాఖ దరఖాస్తుల ద్వారా ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పైన తెలిపిన జిల్లాలలోని వ్యవసాయ పర్యాటకం, బాధ్యతాయుత పర్యాటకం, వారసత్వ పర్యాటకం, కళాకారులు, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ ఆధారిత, ఆరోగ్య రంగాలకు సంబంధించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను వెబ్సైట్ ద్వారా దరఖాస్తును డౌన్లోడ్ చేసుకొని పూర్తి చేసి అప్లోడ్ చేయాలని తెలిపారు. ఉత్తమ రూరల్ టూరిజం గ్రామాలుగా ఎంపికైన గ్రామాలకు రాష్ట్ర జాతీయ స్థాయిలో పురస్కారాలు అందజేస్తారని అన్నారు. మరిన్ని వివరాలకు తిరుపతి జిల్లా పర్యాటక అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి 6309942027, చిత్తూరు జిల్లా పర్యాటక అధికారి నరేంద్ర 9966535697, అన్నమయ్య జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం 6309942032, నెల్లూరు జిల్లా పర్యాటక అధికారి సాయికృష్ణ 9908785777 లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రయాణికుల సౌకర్యానికి పెద్దపీట

- రాయచోటిలో మరో బస్టాండ్ నిర్మిస్తాం
- ఆర్‌టిసి చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ధ్యేయమని ఆర్‌టిసి ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మాణాలు పూర్తయిన బస్టాండ్‌ను మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా, జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ దేవనాథరెడ్డిలతో కలసి వారు ప్రారంభించారు. నూతన బస్టాండ్, డిపో మేనేజర్ ఛాంబర్, కార్యాలయం, జిల్లా ప్రాంతీయ రవాణా అధికారి కార్యాలయం, పార్సిల్ సర్వీస్, రిజర్వేషన్ కౌంటర్ల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రోజు రోజుకూ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్టాండ్‌ను విస్తరించాలన్న ఉద్దేశ్యంతో నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా రూ.2.50 కోట్ల నిధులను మంజూరు చేశారని పేర్కొన్నారు. బస్టాండ్‌కు పక్కనే ఉన్న రెవెన్యూ స్థలం 32 సెంట్ల విస్తీర్ణాన్ని క్యాబినెట్ ఆమోదం పొందేలా చేసి, ఈ స్థలాన్ని కలుపుకుని బస్టాండ్ నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. పట్టణం రోజు రోజుకూ అభివృద్ధి చెందుతోందని, రెండవ బస్టాండ్ నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. బస్సు డిపోను కూడా అభివృద్ధి పరుస్తామన్నారు. చిన్నమండెం, గాలివీడులలో బస్ స్టేషన్లు అధ్వాన్న స్థితిలో ఉన్నాయని, వాటి అభివృద్ధికి కృషి చేయాలని ఆర్‌టిసి ఛైర్మన్‌ను శ్రీకాంత్‌రెడ్డి కోరారు. నియోజక వర్గంలో ప్రతి అంశంలోనూ పురోగతి సాధిస్తున్నామన్నారు. రాయచోటి నుంచి తిరుమలకు నేరుగా వెళ్లే సర్వీసును నడపాలని, కడపకు ఎలక్ట్రికల్ బస్సులు నడపాలని కోరారు. లక్కిరెడ్డిపల్లెలో రూ.50 లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణం, రామాపురంలో రూ.15 లక్షల ఎంపీ నిధులతో బస్ షెల్టర్ నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో 2700 కొత్త బస్సులు త్వరలో అందుబాటులోకి రానున్నాయన్నారు. తిరుమల బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తామన్నారు. లక్కిరెడ్డిపల్లెలో త్వరితగతిన బస్ స్టాండ్ నిర్మాణాల పనులను చేపడతామన్నారు. రాయచోటి నుంచి హైదరాబాద్, విజయవాడలకు స్లీపర్ బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు చిదంబర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు వండాడి వెంకటేశ్వర్లు, కర్ణపు విశ్వనాథరెడ్డి, సీనియర్ నాయకులు జమాల్ ఖాన్, మదనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్,స్థానిక కౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహా రెడ్డి,స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, జడ్‌పిటిసి వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌టిసి ఇడి గిడుగు వెంకటేశ్వర రావు, జిల్లా ప్రజా రవాణా అధికారి రాము, డిఎం ధనంజయ, డిసిసిబి డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు బసిరెడ్డి సుబ్బారెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో బల్లి


- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 64 మంది విద్యార్థులు
- మెరుగైన వైద్య చికిత్సలు అందించాలి : ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తాం : ఆర్‌డిఒ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె

బల్లి పడిన మధ్యాహ్నం భోజనం తిని 64 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం టేకులపాలెం ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. టేకుల పాలెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం భోజనంలో బల్లి పడ్డ ఆహారాన్ని తిన్న 64 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు



విద్యార్థులకు చికిత్స చేస్తున్న వైద్యులు

విషయాన్ని గుర్తించిన వెంటనే తమ పిల్లలను తమ తమ వాహనాలు, ప్రయివేటు వాహనాలలో విద్యార్థులను మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. సంఘటన సమాచారం అందుకున్న మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా జిల్లా ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ ఘటనపై విద్యార్థులు తెలిపిన సమాచారం మేరకు ఎనిమిదవ తరగతి చదివే విద్యార్థికి తాను తింటున్న అన్నంలో బల్లి రావడంతో భయపడి తెలియజేశాడు. ఇది గుర్తించిన పాఠశాల సిబ్బంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు, భోజనం తిన్న విద్యార్థులు అందరిని ప్రయివేట్ వాహనాలలో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులకు ఎవరికి ఎలాంటి హాని జరగలేదని, ప్రస్తుతం వీరందరూ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్నారని సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న మదనపల్లి ఆర్‌డిఒ మురళి ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మదనపల్లి డిఎస్‌పి కేసప్ప ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులను పరామర్శించి వారి తల్లిదండ్రుల నుంచి వివరాలను సేకరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మదనపల్లి పట్టణ అధ్యక్షులు రెడ్డి సాహెబ్ పరామర్శించారు.



సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి గోపాలకృష్ణ

ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించాలి

ప్రజాశక్తి-పీలేరు

ఎన్నికల కమిషన్ రూపొందించిన నిబంధనలను ఎన్నికల విధుల్లో ప్రతి ఒక్కరూ అనుసరించాలని పీలేరు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సెక్టోరల్ అధికారుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నమోదు అధికారి మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల విషయంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎన్నికల సమయంలో సెన్సిబుల్, హైపర్ సెన్సిబుల్ కేంద్రాల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు తెలియపరచాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అభ్యంతరాలు చోటుచేసుకున్నా తక్షణమే ఎన్నికల అధికారికి సమాచారం అందించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ పరిధిలోని పీలేరు, కెవి పల్లి, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల తహశీల్దారులు ధనుంజయులు, నరసింహులు, ప్రదీప్, భాగ్యలత, ఫిరోజ్, ఖాజాబీ, పీలేరు ఎస్సై నరసింహుడు, ఎంఇఒ జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఎఎస్ఒ రామ్మోహన్, 45 మంది సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిన సిఎం : 'గాజుల'

ప్రజాశక్తి-రాయచోటి

ఒక్క ఛాన్స్ అని ఓటు వేస్తే ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అరాచక పాలన సాగిస్తూ, నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి, సంక్షేమం పేరుతో రూ.లక్షల కోట్లు అప్పులు చేసి అడ్డంగా దోచుకుంటూ రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష ఆరోపించారు. బుధవారం పట్టణంలోని కంసల్ వీధి, గాంధీ బజార్ లలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలన గురించి,ఆ ప్రభుత్వం వల్ల ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దెబ్బకు అధోగతి పాలైన రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అన్నారు.అధికారంలోకి రాకముందు ఎన్నో రకాల హామీలు ఇచ్చి, కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసి ముంచారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, జనసేన నాయకులు నవీన్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

భూములు కోల్పోయే రైతులకు న్యాయం చేస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి-వీరబల్లి

వీరబల్లి ఆఫ్-స్ట్రీమ్ క్లోజ్డ్ లూప్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కోసం సేకరిస్తున్న భూములకు చట్టపరిధిలో న్యాయమైన ధరను చెల్లిస్తామని, వంగిమల గ్రామ రైతులకు న్యాయం చేస్తామని కలెక్టర్ గిరీష తెలిపారు. బుధవారం వీరబల్లి ఆఫ్-స్ట్రీమ్ క్లోజ్డ్ లూప్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కోసం రైతుల నుంచి తీసుకుంటున్న భూములకు సరైన ధర నిర్ణయించడంపై వంగిమల డి.రాచపల్లిలో కలెక్టర్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయడానికి ప్రభుత్వాలకు కృషి చేస్తాయన్నారు. ప్రభుత్వం చేసే మంచి పనులకు ప్రజల నుంచి కూడా సహకారం అందాలని తెలిపారు. ఈ ప్రాంతంలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు వస్తోందన్నారు. ఇందుకు దాదాపు 616.56 ఎకరాలు అవసరం అవుతాయని, ప్రజలు రైతులందరూ సహకరించాలని చెప్పారు. 616.56 ఎకరాలలో పట్టా, డికెటి భూమి 121.78 ఎకరాలు కాగా, మిగిలింది ప్రభుత్వ భూమి అని తెలిపారు. చాలామందికి డికెటి లేకపోయినా ప్రభుత్వ భూమిలో ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా రైతులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. రైతులకు ఏవైనా సందేహాలు సంశయాలు ఉంటే నిరంతరభ్యంగా తెలియజేయవచ్చునన్నారు. రైతులు మాట్లాడుతూ ఇక్కడ అంతా నిరుపేద రైతులున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిని నమ్ముకొని వాటిని అభివృద్ధి చేసుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రాజెక్టు పేర్కొన్న ప్రాంతంలో భూములు ఎంతో సారవంతమైనవని చెప్పారు. వీరబల్లి మామిడికి అంతర్జాతీయంగా పేరు ఉందన్నారు. ప్రాజెక్టుకు నీరు ఎక్కడి నుంచి తీసుకుంటారు? ప్రాజెక్టు కోసం నీరు ఆపితే రైతులకు ఇబ్బంది కలుగుతుంది? కొంతమందికి డికెటి పట్టాలు ఉన్నాయి? వారు సాగు చేస్తున్న భూమిలో బోర్ వెల్స్, చెట్లు ఉన్నాయని వాటన్నిటినీ నష్టపోతామని న్యాయం చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అధికారుల పరిధిలో ఎంత మేలు చేయగలిగితే అంత చేస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు నీరుని అన్నమయ్య, చెయ్యేరు ప్రాజెక్ట్ నుంచి



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ఇక్కడ ఏర్పాటు చేసే అప్పర్ లోయర్ రిజర్వాయర్లకు పైపులు ద్వారా నీరు పంప్ చేస్తారని తెలిపారు. ఇక్కడ నీరు ఉండదనే భయం వద్దని, వాతావరణ కాలుష్యం ఉండదని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసే డంపింగ్ యార్డ్‌లో కూడా ప్రాజెక్టు మిషనరీ ఉంటుందని చెప్పారు. ఈ ప్రాజెక్టులో నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తారని, కింది నుంచి నీరు పైకి పంపించేసి మరలా కిందికి పంపుతారని చెప్పారు. దానివల్ల ఎలాంటి పర్యావరణ ముప్పు ఉండదన్నారు. జిల్లాలో 2000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఎవరైతే భూమి సాగులో ఉన్నారో వారికి డబ్బులు ఇస్తామన్నారు. చాలామంది అగ్రిమెంట్ చేసుకున్న వారు ఉన్నారని తెలిపారు. సరైన డాక్యుమెంట్లు ఉంటే వారికి పరిహారం ఇస్తామన్నారు. 2013 కన్సెంట్ అవార్డు చట్ట ప్రకారం నష్టపరిహారం ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ మహేశ్వర్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి, సర్పంచ్ నాగులమ్మ, గ్రామంలోని నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కృష్ణారావు

'మిట్స్'లో అత్యాధునిక ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లు వద్ద గల మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సైబర్ సెక్యూరిటీ) విభాగం వారు అత్యాధునిక టెక్నాలజీతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆవిష్కరించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాల అడ్వైసర్ బి.వి.కృష్ణారావు చేతుల మీదుగా ల్యాబ్‌ను ప్రారంభించామన్నారు. టెక్నాలజీ అయిన ఇంటెల్‌ఐ 7 ప్రాసెసర్,13 జనరేషన్, 32 జి.బి రామ్, 18 జి.బి గ్రాఫిక్స్ కార్డు, 1 టిబి హార్డ్ డిస్క్ తో కూడిన 150 కంప్యూటర్ సిస్టంతో ల్యాబ్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ రంగంలో దిన దినము ఎన్నో నూతన సాఫ్ట్వేర్ లు ఉద్భవిస్తున్నాయని, అవి వేగంగా కంప్యూటర్‌లో రన్ అవడానికి మామూలు కంప్యూటర్లు పనికిరావని, ఈ నూతన టెక్నాలజీతో కూడిన కంప్యూటర్లు అవసరమని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ గంగాదేవి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైఎస్ఆర్ షాదీ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిచే గురువారం వర్చువల్‌గా నాలుగో విడత వైయస్సార్ కళ్యాణమస్తు, వైయస్సార్ షాదీ తోఫా లబ్ధిని పంపిణీ చేస్తారని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి డి.జాకీర్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు రాయచోటి కలెక్టరేట్లోని స్పందన హాలులో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి లబ్ధిని పంపిణీ చేసే వర్చువల్ కార్యక్రమం ప్రసారం చేస్తారన్నారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లాలో వైయస్సార్ కళ్యాణమస్తు, వైయస్సార్ షాది తోఫా పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారుల తల్లుల బ్యాంక్ అకౌంట్ కు ప్రోత్సాహకం జమ అవుతుందన్నారు. లబ్ధిదారులు అందరు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పేర్కొన్నారు.

శ్మశాన వాటికకు నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణంలోని మహబూబ్ కాలనీలోని శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ అన్నమయ్య జిల్లా వైసిపి అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్ అధ్యక్షతన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. జీనత్ మస్జిద్ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా మహబూబ్ కాలనీ ప్రాంతంలో నివాసం ఉంటున్న ముస్లింలందరికీ ఒకే ఒక శ్మశాన వాటిక ఉందని తెలిపారు. గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్మశాన వాటిక ప్రహరీ గోడ కూలిపోయిందన్నారు. ఆ శ్మశాన వాటికలోకి కుక్కలు, మూగజీవాలు వెళ్లడంతో పవిత్రంగా ఉండాల్సిన శ్మశాన వాటిక అపవిత్రం అవుతుందని ఎమ్మెల్యేకి వారు విన్నవించారు. మా విన్నపాన్ని ఆలపించి ఆ శ్మశానికి వాటిక ప్రహరీ నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని వారిని అభ్యర్థించారు.

డిజిటల్ నైపుణ్యతపై అవగాహన అవసరం

- వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

డిజిటల్ ప్రపంచంలో సాంకేతికతపై అవగాహన, నైపుణ్యతను పెంచుకోవడం తక్షణ కర్తవ్యమని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయ కెరీర్ గైడెన్స్ సెల్ సభ్యులు డాక్టర్ వేపరాల లాజర్, మైనారిటీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కె.రియా జున్నీసా, ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సునీత, డాక్టర్ కె.లలిత సంయుక్త ఆధ్వర్యంలో "ప్రస్తుత కాలంలో డిజిటల్ అక్షరాస్యత ప్రాము ఖ్యత" యువతలో ఆరోగ్య ప్రమాద ప్రవర్తనగా హెచ్ఐవి ఎయిడ్స్" అనే అంశంపై నిపుణులతో ఉపన్యాస కార్యక్రమం వైవీయూలో నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి మహానగరాల వరకు వ్యాపారకలాపాలు ఆన్‌లైన్ ప్రపంచంలోనే డిజిటల్ అక్షరాస్యతలో భారతదేశ, ఉండడం గర్వించదగ్గ పరిణా మమని పేర్కొన్నారు. విద్యా రంగంలో డిజిటల్ విధానం అమలవుతోందని ప్రతి ఒక్కరూ గుర్తు చేస్తూ భవిష్యత్తులో రాణించాలంటే డిజిటల్ లిటరసీ అవసరమని పేర్కొ న్నారు."ప్రస్తుత కాలంలో డిజిటల్ అక్షరాస్యత ప్రాముఖ్యత" అనే అంశంపై రిసోర్స్ పర్సన్‌గా హాజరైన కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ, హక్ద ర్యక్-నాస్కామ్ ఫౌండేషన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.నాగేశ్వర్ రావు మాట్లాడుతూ కరోనా మహమ్మారి ప్రజల్ని ఇంటికే పరిమితం చేసిన ప్రత్యామ్నాయంగా డిజిట లైజేషన్ అలవాటు పడ్డామని తెలిపారు. ఈ విధానం వల్ల వనగూరే ప్రయోజనాలను ఉదాహరణలతో వివరించారు. ఆధునిక సాంకేతికతను, డిజిటల్ విధానాన్ని అందిపుచ్చుకోకపోతే పోతామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఉచిత బీమా పథకాల ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తూ అందులో నమోదు కావాలని విద్యార్థులకు సూచించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనై జేషన్ కన్సల్టెంట్ షేక్. ఇంతియాజ్ అహ్మద్ "యువతలో ఆరోగ్య ప్రమాద ప్రవర్తనగా హెచ్ఐవి ఎయిడ్స్" అనే అంశంపై మాట్లాడారు. హెచ్ఐవి పుట్టుక, వ్యాధి వ్యాప్తి, యువత విలువల జీవన విధానం గురించి అవగాహన కల్పించారు. బీమా నమోదుకు ప్రత్యేక కార్యచరణ కేంద్ర ప్రభుత్వం అందించే ఉచిత బీమా నమోదుకు విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని యోగి వేమన విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ, హక్దర్శక్-నాస్కామ్ ఫౌండేషన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.నాగేశ్వర్‌రావు, షేక్ ఇంతియాజ్ అహ్మద్ విశ్వవిద్యాలయ విసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు బీమా నమోదు విషయంపై చర్చించారు. త్వరలోనే విద్యార్థుల కోసం డ్రైవ్ ద్వారా బీమా నమోదు కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. ఆయా సంస్థల ప్రతినిధులను వైవీయూ విసి ఆచార్య సుధాకర్, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు.

మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుదాం : 'చింతల'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

అన్నమయ్య జిల్లాలో పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఓ మోడల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుదామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే అధ్యక్షతన స్థానిక ఆసుపత్రి కొత్త భవనంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీలేరు ప్రభుత్వాసుపత్రి 50 పడకల స్థాయి నుంచి వంద పడకల స్థాయికి విస్తరిస్తుండడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ ఆసుపత్రి విస్తరణలో చాలామంది కృషి, పట్టుదల ఉన్నాయని గుర్తు చేశారు. జిల్లాలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చాలా మంచి పేరు, గుర్తింపు ఉన్నాయని, అవి చెరగకుండా అలాగే కొనసాగిస్తూ రోగుల సంఖ్య పెరిగేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది తగిన రీతిలో వారికి సేవలు అందించాలని కోరారు. పీలేరు పట్టణానికి రెండు జాతీయ రహదారులు ఉండడంతో తరచూ రహదారులపై ప్రమాదాలు జరుగుతుంటాయని, ఆసుపత్రికి అత్యవసర వైద్యం కోసం వచ్చే క్షతగాత్రుల సంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. అందు కోసం పీలేరు ఆసుపత్రి అత్యవసర వైద్య విభాగంలో ట్రామా కేర్ సెంటర్ అవసరం ఉందని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి దాని మంజులకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇక్కడ డయాలసిస్ సెంటర్ కూడా అవసరం ఉందని చెప్పారు. ఆసుపత్రి అభివ ృద్ధికి దాతల సహకారాన్ని కూడా కోరుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి, జెడ్పిటిసి ఏటి రత్నశేఖర్ రెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ షేక్ హబీబ్ బాష, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ, వైస్ ఎంపిపి ఎన్.వెంకటాచలపతి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మహితా ఆనంద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ నాగరాజమ్మ, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, కంభం నరసింహారెడ్డి, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నేతలు నిజాలు మాట్లాడాలి : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కనీస అవగాహన లేక నోటికొచ్చినట్లు మాట్లాడకుండా వైసీపీ నేతలు వాస్తవాలు మాట్లాడాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బత్యాల చెంగల్రాయులు అన్నారు. టిడిపి నేతలు భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో సైబర్ క్రైమ్‌కు పాల్పడుతున్నారని ఆరోపించిన వైసిపి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలకు స్పందిస్తూ బుధవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానాడు సభలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల మినీ మేనిఫెస్టోను ప్రకటించిందని, మేనిఫెస్టో ప్రకారం ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ ప్రతి ఓటరును కలిసి తమ మేనిఫెస్టోను వివరించి షఉరిటీ పత్రాలు అందజేయడం జరుగుతోందని తెలిపారు. ఇందులో భాగంగా టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మిరియాల జ్యోతి ఇటీవల పట్టణ పరిధిలోని ఆకుల వీధిలో ఓటర్ వెరిఫికేషన్, భవిష్యత్తుకు గ్యారెంటీ-బాబు ష్యూరిటీ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే వైసిపి నాయకులు అడ్డుకొని మహిళా కార్యకర్త పట్ల అనుచితంగా ప్రవర్తించారని, ఈ చర్యను తాను పూర్తిగా ఖండిస్తున్నానని అన్నారు. ఓటర్ వెరిఫికేషన్, బాబు షఉరిటీ కార్యక్రమాలలో తాము ప్రజల వద్ద ఆధార్ కార్డు గాని, ఓటర్ కార్డు గాని సేకరించలేదని తెలిపారు. నేడు ప్రతి నిత్యావసర కార్యక్రమాలకు ఒటిపి అనేది సర్వసాధారణమని అన్నారు. ఇది సైబర్ క్రైమ్ ఎలా అవుతుందో సజ్జల రామకృష్ణారెడ్డి నిరూపించాలని, దీనిపై ఎప్పుడైనా తాను చర్చకు సిద్ధమని సజ్జలకు సవాల్ విసిరారు. కనీస జ్ఞానం లేని సజ్జల ప్రభుత్వ సలహాదారుగా ఎలా రాణిస్తున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, రూరల్ అధ్యక్షులు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షులు డి ఆర్ ఎల్ మణి, మైనార్టీ నాయకులు అబూబకర్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, దళిత నాయకులు జడ శివ, జ్యోతి శివ, ప్రభు దాస్, తిరుపాలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయులు


ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కమిషనర్ పిఆర్.మనోహర్ ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు కార్మికుల తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో పారిశు ధ్య పనులు నిర్వహించారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలకు మంచి సంకేతాలు వెళతా యన్నారు. జగనన్న క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో నిర్విరామంగా పారిశుధ్య పనులు నిర్వహి స్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు విజృంభిస్తున్నాయని ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడకు గౌతమ్ స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి-గాలివీడు


అభిషేక్

అండర్-17 విభాగంలో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడకు తమ పాఠశాల విద్యార్థి అభిషేక్ ఎంపిక కావడం హర్షణీయమని గౌతమ్‌స్కూల్ ప్రిన్సిపల్, కరస్పాండెంట్ సింటు ఇమ్మానుయేల్, సైజు థామస్‌లు హర్షం వ్యక్తం చేశారు. 9వతరగతి చదువుతున్న అభిషేక్‌కు రాష్ట్రస్థాయి క్రీడల్లో గెలుపొంద డంపై హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో కేవలం విద్యకే కాకుండా పిల్లలలోని గుణాత్మక విద్యను క్రీడలపై ఆసక్తి ఉన్నవారిని కూడా ప్రోత్సహి స్తున్నా మనిపేర్కొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలోని శ్రీ హరిహర ఆలయంలో గత 20 రోజుల నుంచి దీక్షలు చేస్తున్న అయ్యప్ప స్వామి భక్తులకు బుధవారం నీలకంఠారావు పేట చెందిన సెల్ పాయింట్ యజమాని ముస్లిం నాయకుడు ఎస్ .జాఫర్‌ఖాన్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప భక్తులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు.


అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సిడిపిఒ భారతి

ప్రజల భాగస్వామ్యంతోనే అంగన్వాడీలు బలోపేతం

ప్రజాశక్తి-కలికిరి

ప్రజల భాగస్వామ్యంతో అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని సిడిపిఒ భారతి అంగ న్వాడీ కార్యకర్తలకు సూచించారు. బుధవారం ఐసిడిఎస్ వాల్మీకిపురం ప్రాజెక్ట్ ఇందిరమ్మకాలనీ జడ్‌పి హైస్కూల్లో నిర్వహించారు. నాడు-నేడు పనులు, అంగన్వాడీ కేంద్రాలకు మరమ్మతులపై అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అంగ న్వాడీ లకు ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి కమిటీల ద్వారా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రీ ప్రైమరీ శిక్షణను బలోపేతం చేసి వారికి పోషణ అందించడం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, జిల్లా నోడల్‌ఆఫీసర్ నాగరాజు, టెక్నికల్ డిఆర్‌పి గోపి, అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి


మహిళకు చీరను అందిస్తున్న గంటా ట్రస్ట్‌సభ్యులు

గంటా నరహరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాగార్జున ఆధ ర్యంలో వీరబల్లి మండలం తాటి గుంపల్లి దళిత వాడ, గుట్ట తూర్పు దళితవాడ, గుట్ట పడ మర దళితవాడ, మట్లి గంగా పురంలో మహిళలకు చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరబల్లి టిడిపి మాజీ ఇన్‌ఛార్జి నాగమునిరెడ్డి, స్థానికులు మోహన్, రాజబాబు , ఆనంద్, పూజారి రామక్రిష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.10 లక్షలు

ప్రజాశక్తి-పుల్లంపేట

టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో పురాతన ఆలయాల అభివృద్ధికి పది లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని శాంతి లింగేశ్వర ఆలయాన్ని కార్తీక మాసం ఏర్పాట్లను పరిశీలన నిమిత్తం సందర్శించినట్లు ఆయన తెలిపారు. ఆలయ అర్చకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం శాలువాతో సత్కరించినట్లు తెలిపారు. పురాతన ఆలయాల అభివృద్ధికి టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అధికారి జయరాములు, భూగర్భ జలశాఖ అధికారి ప్రసాద్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎంపిపి

ప్రజాశక్తి-కలికిరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వేంపల్లి నూర్జహాన్

ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నూర్జహాన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు చేపడుతున్నటువంటి ప్రభుత్వ పథకాలను ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి తెలపాలని అన్నారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును గుర్తుచేసి రాబోవు ఎన్నికలలో వైసిపికి మద్దతుగా అత్యంత మెజార్టీతో వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. గుట్టపాలెం సర్పంచ్ రెడ్డివారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో రోడ్డురవాణాశాఖ నిర్లక్ష్యం వల్ల రోడ్లు గుంతలమయమయ్యాయని , సమావేశానికి కూడా రాకుండా నిర్లక్ష్య వైఖరిని పాటిస్తున్నారని తెలిపారు. అద్దేవారిపల్లి సర్పంచ్ గంగయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఏకో పాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థులకు మీటింగులు యాప్ వల్ల సరిగ్గా పట్టించు కోవడం లేదని తెలుపగా, ఎంఇఒ వివరిస్తూ వారు శెలవులో ఉన్నప్పుడు వారి స్థానంలో మరొక టీచర్‌ను నియమిస్తున్నామని చెప్పారు. మండల అన్ని శాఖల అధికారులకు ప్రతి ఒక్క శాఖవారు కూడా వారి శాఖకు సంబంధించిన ప్రజలు ఏదైనా సమస్య తెలిపితే నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపిపి కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, ఎంపిటిసిలు, సర్పం చులు, పంచాయతీ కార్యదర్శులు,అధికారులు పాల్గొన్నారు.

'స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్'లో బంగారు పతకాలు


మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ప్రదీప్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని స్థానిక గాంధీనగర్‌లోని విజ్‌డమ్ సిబిఎస్‌ఇ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్,అడ్మిన్ డైరెక్టర్ మదన్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19న పులివెందుల మున్సిపల్ గ్రౌండ్స్‌లో సెకండ్ వైఎస్ఆర్ స్పీడ్ ఛాంపియన్ షిప్ కడప వారు నిర్వహించిన స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ జిల్లా స్థాయి పోటీలలో అండర్-8 విభాగంలో ఎం.పునీత్‌రాయ్ 200 మీటర్లు, 400 మీటర్లు, 1000 మీటర్లలో గోల్డ్ మెడల్స్ సాధించడమే కాక ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించాడని అన్నారు. అండర్-10 విభాగంలో ఎం.రేవంత్ 200,400 మీటర్లలో గోల్డ్ మెడల్, అండర్-12 విభాగంలో ఎ.జస్వంత్ 200 మీటర్స్ బ్రాంచ్ మెడల్ 400,1000 మీటర్లలో గోల్డ్ మెడల్, ఎం.యువరాజ్ 200,400 మీటర్లలో బ్రౌంజ్ మెడల్ సాధించినట్లుగా వారు తెలిపారు. పాఠశాల విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తుందని చెప్పడానికి ఈ మెడల్స్ నిదర్శనం అన్నారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి



చలో విజయవాడ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శివశంకర్‌రెడ్డి

డిసెంబరు 10న విజయవాడలో జరగబోవు అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయ్ మహాసభను విజయవంతం చేయాలని అవుట్‌సోర్సింగ్ అన్నమయ్య జిల్లా చైర్మన్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎపి మోడల్‌స్కూల్లో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డితో కలిసి రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆయనకు వివరించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బందితో సమావేశమై వారు మాట్లాడారు. రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఒక గంట అదనంగా పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం సమాన పలికి సమాన వేతనం ఇస్తామని ఇంతవరకు పట్టించుకోలేదని అన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో మహాసభ ఏర్పాటు చేశారని ప్రతి ఒక్కరు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో హౌస్ కోచింగ్ ఉద్యోగుల సమస్యల గురించి ప్రభుత్వానికి వివరిస్తామని తెలిపారు. ఉద్యోగులను జీతాలు పెంచి కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి భద్రత కల్పించాలని కోరుతామని వారు తెలిపారు. ఉద్యోగ సీనియారిటీ పరిగణనలోకి తీసుకొని వార్షిక ఇంక్రిమెంటు ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామ్మూర్తినాయక్, జనరల్ సెక్రెటరీ నాగరాజు, ట్రెజరీ నాగరాజు, జాయింట్ సెక్రెటరీ పద్మనాభం వెంకటరమణ, ఉమామహేశ్వరి, హుస్సేన్‌సాబ్, పీరయ్య, వసంత కుమారి, పెద్దక్క పాల్గొన్నారు.

టిడిపి అధికారంలోకొస్తే 'ఆరు గ్యారంటీలు'


ఇంటింటి ప్రచారంలో టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట గ్రామంలో రైల్వే కోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేసి పేద, బడుగు బలహీన వర్గాలు, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగు నింపడమే లక్ష్యమని అన్నారు. టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరిస్తూ కరపత్రాలు అందించారు. అప్పయ్య రాజుపేట గ్రామంలో ప్రచారంలో దూకుడు పెంచారు. తల్లికి వందనంపేరుతో కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువు తున్నా అందరికీ ఏడాదికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తామని అన్నారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడా దికి మూడు ఉచిత గ్యాస్ సిలండర్లు అందిస్తామని, ఆడబిడ్డ నిధి పథకం క్రింద 18 ఏళ్ళు నిండిన ప్రతి మహి ళకూ నెలకు రూ.15 వేలు అందించనున్నట్లు చెప్పారు. యువగళంనిధి పథకం ద్వారా నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తూ పూర్ టు రిచ్ పథకంతో పేదలను సంపన్నులు చేయడమే టిడిపి లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఆర్ సుధాకర్‌నాయుడు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు, వైద్యులు

వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-మదనపల్లె

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆస్పత్రి ఆధ్వర్యంలో మదనపల్లె నక్కలదిన్నె సత్సంగ్ ఫౌండేషన్ వారి స్వాస్థ్య హాస్పిటల్స్‌లో మహిళల కోసం 148వ పింక్‌బస్ కేన్సర్‌వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ పింక్‌బస్ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్యం ప్రధానాంశంగా భావించి మహిళలకు ఉచిత కేన్సర్‌వ్యాధి నిర్ధారణకై మహిళా వైద్య సిబ్బందిచే నిర్వహిస్తున్న రీజన్ ఛైర్ పర్సన్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పి. ఎం.రాజశేఖరెడ్డి అభ్యర్థన మేరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పింక్ బస్ క్యాంప్‌ను డాక్టర్ వెంకటరమణ, న్యూరో సర్జరీ బెంగుళూరు, ప్రియంవద, ఆర్ఎంఒ స్వాస్థ్య హాస్పిటల్, డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సత్సంగ్ ఫౌండేషన్ సభ్యులు పింక్ బస్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్ర మంలో డాక్టర్ మహీజ, డాక్టర్ శ్రీనిధి, డాక్టర్ రమ్య, డాక్టర్ జి.సాయి, డాక్టర్ దివ్యతులసియని, డాక్టర్ చందు ప్రియ, డాక్టర్ మధుబాబు, శ్వేత, ఎడి(పిఆర్) వి. రాజశేఖర్, పద్మజ, నాగభూషణమ్మ పాల్గొన్నారు.

నేడు బాలయ్యగారిపల్లిలో 'వై నీడ్స్ జగన్'

ప్రజాశక్తి-కలకడ

మండల పరిధిలోని బాలయ్యగారిపల్లిలో గురువారం 'వైఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి కమలాకర్‌రెడ్డి, ఎంపిపి శ్రీదేవి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ పథ కాల బోర్డ్ ఆవిష్కరణ, వైసిపిజెండా ఎగురవేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరం కలిసి కార్యక్ర మాన్ని విజయవంతం చేసి, జగనన్న దార్శ నికతతో కూడిన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో పురోగ మనాన్ని కొనసాగించేందుకు కృషి చేద్దామని అన్నారు. సిఎం జగన్ నాయకత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళదామన్నారు. మండలంలోని వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి, సంక్షేమమే సిఎం ధ్యేయం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

అభివృద్ధి,సంక్షేమమే సిఎం జగన్‌మోహన్ ధ్యేయమని జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అనంతపురం గ్రామంలో నిర్వహించిన ఎపికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్ర మంలో భాగంగా స్థానిక ఉప మండల అధ్యక్షుడు సమరసింహారెడ్డి, సర్పంచ్ వెంకట నారాయణరెడ్డి, కళ్యాణి ప్రభాకర్ రెడ్డిలతో కలిసి ఎంపిపిముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నగదును వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. మేలు జరిగింటేనే నాకు ఓటు వేయండి అని అడిగే ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనన్నారు. సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి మాట్లాడుతూ అనంతపురం చౌడపల్లి గ్రామాలను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డిల సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తు న్నామన్నారు. అనంతరం ఈడిగపల్లెలోని స్థానిక మూడు రోడ్ల కుడలిలో వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సమరసింహరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్‌అమీర్, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహరెడ్డి, సర్పంచ్‌లు వెంకటనారాయణరెడ్డి, గడ్డంకళ్యాణి, ప్రభాకరరెడ్డి, సుబ్బరాయుడు, గంగయ్య, అంజి పాల్గొన్నారు. **రామసముద్రం :** జగనన్న పాలన దేశానికే ఆదర్శమని వైసిపి మండల నాయకులు అన్నారు. మండలంలోని చొక్కాండ్లపల్లె పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ రుక్మిణమ్మ , గెవన్న ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2024లో సిఎం ఎందుకు కావాలనే కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రజా ప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ, జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయటంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల వ్యవస్థ సహకారంతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు వీరి ద్వారా నూరు శాతం అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి సుధాకర్ రెడ్డి, ఎంపిపి కుసుమకుమారి, వైస్ ఎంపిపి రమణారెడ్డి, సింగిల్ విండోఅధ్యక్షుడు కేశవరెడ్డి, జిల్లా వైసిపి ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొండూరు క్రిష్టారెడ్డి, ఎంపిటిసి మూగవాడి రెడ్డెప్ప, రెడ్డిశేఖర్, మాజీ ఎంపిటిసి దొడ్డిపల్లె ఆనంద, ఈశ్వర్ రెడ్డి, సర్పంచ్ ఉదయ్‌శంకర్ రెడ్డి, ఎస్‌సి సెల్ క్రిష్ణప్ప, కొమ్ము నారాయణస్వామి, రమేష్ పాల్గొన్నారు.

కూలిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-గాలివీడు


విరిగిపడ్డ విద్యుత్‌స్తంభం

పట్టణంలోని స్థానిక సలాది కాలనీలో కేబుల్ నెట్ వర్క్ వైర్లను లాగే క్రమంలో విద్యుత్ స్తంభం కూలిపోయింది. విద్యుత్ స్తంభం కూలి పోవడంతో ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్ప డంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. సమయానికి విద్యుత్ అధి కారులు అధికారులు స్పందించకపోవడంతో సలాది కాలనీ, మంగళ ఎస్‌సి కాలనీలో అంధాకారంతో నిండిపోయింది.



పెద్దచెరువుకట్టపై పడివున్న వ్యర్థాలు

డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న పెద్దచెరువుకట్ట

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని గాలివీడులోని పెద్దచెరువుకట్ట వ్యర్థ పదార్థాలకు నిలయంగా మారి డంపింగ్ యార్డును తలపిస్తోంది. చెరువుకట్ట చుట్టూ నిర్మించుకుంటున్న గృహాల నుంచి వ్యర్థ పదార్థాలను అక్కడే వేసి వెళుతుండటంతో అపరిశుభ్రత నెలకొని దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన చెందు తున్నారు. గోరాన్‌చెరువు పంచాయతీ కుమ్మరిపల్లి పెద్దచెరువు వద్ద గతంలో కలెక్టర్ పర్యటన సందర్భంగా వ్యర్థపదార్థాలపై దృష్టి పెట్టడంతో అధికారులు వాటిని తొలగించారు. అధికారులు ఎన్ని చర్యలు తీసుకుం టున్నా చెరువు కట్టను వ్యర్థాలను మానకుండా వేస్తూనే ఉన్నారని, వాటి నుంచి వచ్చే కాలుష్యం కోరాల్లో మగ్గుతు న్నామని కుమ్మరిపల్లి, గేటు దగ్గర ఉన్న నివాసమున్న ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని పెద్దచెరువుకట్ట ప్రాంతంలో వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటి పట్టాలు మంజూరయ్యేనా?

- సందేహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-బి కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలో అర్హులైన వారికి 90 రోజులు అందరికీ ఇల్లు పథకం ద్వారా ఇంటి పట్టాలు మంజూరు చేయవలసి ఉంది. అర్హులను గుర్తించి ఆన్‌లైన్ చేసి అధికారులు వెరిఫికేషన్ పూర్తి చేసి లబ్దిదారు లను గుర్తించారు. ఆర్‌డిఒ లాగిన్ లోనే 14 రోజుల్లోగా అప్రూవల్ కావలసి ఉండగా ఆర్‌డిఒ లాగిన్ లోనే 72 రోజులు గడుస్తున్నా అప్రూవల్ కాలేదు. తిరిగి జెసి లాగిన్‌లో 67 రోజులు పెండింగ్ రోజులు ఆర్‌డిఒ లాగిన్ లోనే గడిచిపోవడంతో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్‌డిఒ లాగిన్‌లో అప్రూవల్స్ జెసి లాగిన్ లోకి వెళ్లే లోపు ఎన్నికలకోడ్ వచ్చి అర్హులైన వారికి ఇంటి పట్టా మంజూరు కావేమోనని లబ్దిదారులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి 90 రోజులు పథకంలో రావలసిన గృహాలు నెలలు కొద్దీ ఆర్‌డిఒ లాగిన్‌లో పెండింగ్ ఉండడంతో మాకు ఇంటి పట్టా వచ్చేనా అని పలువురు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బంకు నిర్వాహకులకు నోటీసులు ఇస్తున్న నగర పంచాయతీ అధికారులు

బంకు నిర్వాహకులకు నోటీసులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

'కనిపించని ఆస్పత్రి ముఖద్వారం' అనే శీర్షికతో సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఎదురుగా మురుగునీటి కాలువపై ఓ బంకు ఉండడంతో ఆస్పత్రి ముఖద్వారం కనిపించడం లేదు. ప్రజలు,రోగుల బంధువులు పాత్రికేయులు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యపై కథనం ప్రచురితం కావడంతో నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్ మనోహర్ టౌన్ ప్లానింగ్ అధికారులు చేత సదరు బంకు నిర్వాహకులకు నోటీసులు ఇప్పించి తొలగింపులకు చర్యలు చేప ట్టాలని ఆదేశించారు. బుధవారం నగర పంచాయతీ సిబ్బంది బంకు నిర్వాహకులకు నోటీసులు అందజేసి వీలైనంత త్వరగా బంకులు తొలగించాలని సూచించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భారతదేశం ఎంతో సాంకేతికంగా అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ ఇంకా కొన్ని ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయని, బాల్యవివాహాలతో అనేక అనర్థాలు జరుగుతాయని ఐసిడిఎస్ సూపర్వైజర్లు జి.గౌరీదేవి, హిజాద్ ప్యారీలు పేర్కొన్నారు. బాల్య వివాహాలపై బి.కొత్తకోట పట్టణంలోని కెజిబివి పాఠశాల విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జి.గౌరీదేవి,హిజాద్ ప్యారీలు మాట్లాడుతూ అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలలోపు వారికి వివాహం చేస్తే బాల్య వివాహంగా పరిగణిస్తారన్నారు. 18 సంవత్సరాల కంటే ముందే వివాహం జరిగితే వారు శారీరక, మానసికంగా ఎనుగుదల లేకపోవడం, గర్భస్రావం జరగడం, కాన్పుల సమయంలో ఇబ్బందులకు గురవుతారని అన్నారు. తల్లిదండ్రుల భయం, మేనరికాలు లాంటి సమస్యలతో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. బాలికలను బాగా చదివించి వారిని ప్రయోజకులను చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. 18 ఏళ్లు పైబడిన తర్వాతనే వివాహవం చేయాలని సూచించారు. బాల్యవివాహం వద్దు-చదువేముద్దు, ఆపదలో వున్న ఆడపిల్లల తక్షణ సహాయం కోసం 112,100,1098,181 అనే హెల్ప్ లైన్ నెంబరు సంప్రదించాలన్నారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలు బాగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిఎంఎస్ కె.సరితా, ఇన్‌ఛార్జి ఎస్ఒ బి.రేవతి, కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 'విద్య అభ్యసనాభివృద్ధి'

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన విద్యా అభ్యసనా అభివృద్ధి కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ మునిస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ అభివృద్ధి కార్యక్రమంలో నేర్చుకున్న మెలుకువలు పాఠశాల తరగతిగదిలో విద్యార్థులకు తెలియజేయాలన్నారు. మెలకువలు విద్యార్థులకు తరగతి గదిలో బోధించినప్పుడు వారు వాటిని క్షుణ్ణంగా విని అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పిలు ప్రసాద్ రెడ్డి, రవిశంకర్, నాగ కేశవ, స్వతంత్రబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భూ వివాదంపై ఘర్షణ : కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

భూవివాదంపై చోటు చేసుకున్న ఘర్షణలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని కె.బాటవారిపల్లి పంచాయతీ అక్కన్నగారికోటకు చెందిన గెంటెం తిరుపతి, అతని అన్నద మ్ములకు భూమి ఉందని తెలిపారు. అదే గ్రామానికి చెందిన తిరుపతినాయుడు వర్గీయులు దారి విషయంగా గత కొద్దిరోజులుగా ఘర్షణ పడుతూ కోర్టును ఆశ్రయించారని అన్నారు. కోర్టులో గతంలో తిరుపతి నాయుడుకు దారి ఏర్పాటు చేసుకునేలా హైకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఇదే క్రమంలో గెంటెం తిరుపతి కూడా హైకోర్టును ఆశ్రయించాడన్నారు. ఈ భూమి తనకే చెందుతుందని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో దారి ఏర్పాటు చేసిన భూమిని చదును చేసే తరుణంలో గెంటెంతిరుపతి, తిరుపతి నాయకులకు ఘర్షణ జరిగిందన్నారు. ఈ ఘర్షణలో తిరుపతినాయుడు వర్గీయులు గెంటెం తిరుపతిని, అతని బంధువులను కులం పేరుతో దూషించి కర్రలతో కొట్టి గాయపరిచినట్లు తెలిపారు. గెంటెం తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ తిప్పేస్వామి ఈ ఘటనపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.